ప్రజాశక్తి
గురువారం 17 జులై 2025
5
విజయనగరం

గురుకులాల్లో ఖాళీ సీట్ల భర్తీకి కౌన్సిలింగ్

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

జిల్లాలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలు/కళాశాలల్లో 5వ తరగతి నుండి ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం వరకు ఖాళీగా ఉన్న సీట్లకు అడ్మిషన్ కౌన్సిలింగ్ ఈనెల 19న నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలిపారు. నెల్లిమర్ల గురుకుల పాఠశాల/కళాశాలలో కౌన్సిలింగ్ జరుగుతుందని, జిల్లాలోని ఎనిమిది బి.ఆర్. అంబేద్కర్ గురుకుల పాఠశాలల్లో మొత్తం 983 సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. 5వ తరగతిలో 238 సీట్లు, 6వ తరగతి 57 సీట్లు, 7వ తరగతి 46 సీట్లు, 8వ తరగతి 23 సీట్లు, 9వ తరగతి 16 సీట్లు, 10వ తరగతి 61 సీట్లు, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం 257 సీట్లు, ద్వితీయ సంవత్సరం 285 సీట్లు ఉన్నాయని తెలిపారు. ఆసక్తి గల ఎస్‌సి, ఎస్‌టి బాల బాలికలు కౌన్సిలింగ్‌కు హాజరు కావాలని తెలిపారు. బాలికలు ఉదయం 9 గంటలకు, బాలురు మధ్యాహ్నం 1గంటకు హాజరు కావాలని తెలిపారు.

డిగ్రీ ప్రవేశాల కోసం
గళమెత్తిన విద్యార్థులు

- ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి
- ఉద్రిక్తంగా మారిన ఆందోళన
- విద్యార్థినిపై చేయి వేసిన ఎస్ఐ అప్పారావుపై విద్యార్థుల ఆగ్రహం
- అధికారులు స్పందించకపోవడంతో గేట్లు తీసుకుంటూ వెళ్లి లోపల బైఠాయింపు
- ప్రభుత్వం డిగ్రీ ప్రవేశాలు,కల్పించి బకాయి ఫీజులు చెల్లించాలి
- ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి ప్రసన్నకుమార్
- దిగొచ్చిన అధికారులు... పరిష్కారానికి హామీ

గేటు తీసుకొని కలెక్టరేట్‌లోకి వస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో వెంటనే ప్రవేశాలు కల్పించాలని, బకాయి ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని, జీవో 77ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన చలో కలెక్టరేట్ ఉద్రిక్తంగా మారింది. ఉదయం పది గంటలకు కలెక్టరేట్‌కు ర్యాలీగా చేరుకున్న విద్యార్థులు ఔట్ గేటు వద్ద బైఠాయించారు. మధ్యాహ్నం 12గంటలైనా అధికారులెవరూ రాకపోవడంతో విద్యార్థులు గేట్లు తీసుకుంటూ ముందుకు వెళ్లేందుకు ప్రయత్నించారు. దీంతో కొద్దిసేపు పోలీసులకు, విద్యార్థులకు తోపులాట జరిగింది. అయినా అధికారులు రాకపోవడంతో గేట్లు ఎక్కి విద్యార్థులు లోపలకు వెళ్లారు.మరికొందరు చిన్న గేటు తీసుకొని వెళ్లారు. విద్యార్థులను పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేయడంతో ఇరువురి మధ్య తోపులాట జరిగింది. ఆ సమయంలో ఎస్ఐ అప్పారావు విద్యార్థినులపై చేయి వేయడంతో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు పోలీసుల తీరుపై మండిపడ్డారు. విద్యార్థినులపై పోలీసులు చేయి వేసే హక్కు ఎవరిచ్చారంటూ ఎస్ఐపై ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి ప్రసన్నకుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులంతా కలెక్టరేట్ ఆవరణలో బైఠాయించడంతో పోలీసులు ఎస్ ఎఫ్ ఐ నాయకులకు నచ్చ చెప్పి గేటు లోపల కూర్చోబెట్టి అధికారులకు సమాచారం ఇచ్చారు. ఇన్‌ఛార్జి డిఆర్‌ఒ ఆర్.మురళి అక్కడికి వచ్చి విద్యార్థుల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డిఆర్‌ఒకు ఎస్ ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి కె.ప్రసన్నకుమార్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.రాము, సిహెచ్ వెంకటేష్ వినతి అందజేశారు. రాష్ట్రవ్యాప్తంగా డిగ్రీలో ప్రవేశాలు ఇంతవరకు చేపట్టలేదని, ఇంటర్ ఉత్తీర్ణులైన విద్యార్థులు ఏమి చేయాలని ప్రశ్నించారు. వెంటనే ప్రవేశాలు ఆన్ లైన్లో కాకుండా ఆఫ్‌లైన్‌లో చేయాలన్నారు. బకాయి ఉన్న ఫీజులు చెల్లించాలన్నారు. డిగ్రీలో మేజర్,మైనర్ విధానం రద్దు చేసి,పాత విధానం అమలు చేయాలని, జీఓ 77ను రద్దు చేసి పీజీ విద్యార్థులకు స్కాలర్‌షిప్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేసి, శాశ్వత భవనం నిర్మించాలని కోరారు. వసతి

గేటు తోసుకొని లోపలకు వెళ్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు

గృహాలలో ఉన్న సమస్యలు పరిష్కారం చేసి, శాశ్వత భవనాలు నిర్మించాలని కోరారు. డిఆర్‌ఒ స్పందించి కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి నివేదిస్తామని, వసతి గృహాల సమస్యలపై సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. విద్యార్థుల

ఇన్‌ఛార్జి డిఆర్‌ఒ మురళికి వినతినిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ కార్యదర్శి ప్రసన్నకుమార్

పోరాటానికి యుటిఎఫ్ రాష్ట్రనాయకులు కె.విజయగౌరి మద్దతు తెలిపారు. ప్రభుత్వం జూలై నెల కావస్తున్నా డిగ్రీ ప్రవేశాలు చేపట్టకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. పేద విద్యార్థులకు చదువును దూరం చేసే పని కూటమి ప్రభుత్వం చేస్తోందన్నారు. అంతకు ముందు స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి కలెక్టరేట్‌కు వందలాది మంది విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు రవికుమార్, చిన్నబాబు, సమీరా, వెంకటేష్, శిరీష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ గేటు ముందు బైఠాయించిన విద్యార్థులు, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

గేటు ఎక్కి నినాదాలు చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

నిర్వాసితుల సమావేశంలో మాట్లాడుతున్న విద్యారంగ నిపుణులు విఠపు బాలసుబ్రమణ్యం

జిందాల్ నిర్వాసితులకు అండగా ఉంటాం

పిడిఎఫ్ శాసనమండలి మాజీ ఫ్లోర్ లీడర్ విఠపు బాలసుబ్రమణ్యం

ప్రజాశక్తి-శృంగవరపుకోట

జిందాల్ కంపెనీని నమ్మి భూములు ఇచ్చిన రైతులకు ప్రభుత్వం చేసిన ఒప్పందాలు అమలు కానందున వెంటనే స్పందించి ఆ భూములు తిరిగి రైతులకు ఇవ్వాలని శాసన మండలి మాజీ ఫ్లోర్ లీడర్ విఠపు బాల సుబ్రమణ్యం కోరారు, బుధవారం బొడ్డవర వద్ద గత కొన్ని రోజులుగా ఆందోళన చేస్తున్న నిర్వాసిత రైతులతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ నిర్వాసితులకు న్యాయం జరిగే వరకూ పిడిఎఫ్ ఎమ్మెల్సీలు మీకు అండగా ఉంటారని తెలిపారు మీరు చేస్తున్న పోరాటంలో న్యాయం ఉన్నందున విజయం సాధించే వరకు పోరాటం కొనసాగించాలన్నారు. కంపెనీ కోసం తీసుకున్న భూముల్లో 18 సంవత్సరాల కావస్తున్నప్పటికీ కంపెనీ కట్టనందున చట్టం ప్రకారం ఆ భూములు రైతులకు దక్కాల న్నారు. రాష్ట్రమంతటా రైతుల భూములను కంపెనీల పేరుతో బడా సంస్థలకు అప్పగించడం, లేదా ధారాదత్తం చేయడం అన్యాయమన్నారు. నెల్లూరు, కర్నూలు ప్రాంతాలలో సోలార్ పేరుతో మొత్తం భూమిని లాగేస్తుంటే గ్రామాల్లో ఉన్న రైతులందరూ ఒక్కటై హైవేలు దిగ్బంధం చేస్తేనే ప్రభుత్వం దిగి వచ్చిందన్నారు.గిరిజన, దళిత రైతులను కంపెనీలు, ప్రభుత్వాలు మోసం చేయడం సరికాదన్నారు. ఎమ్మెల్సీ ఇందుకూరి రఘు రాజు మాట్లాడుతూ నిర్వాసితులు చేస్తున్న న్యాయమైన పోరాటానికి అనుమతులు ఇవ్వక పోవడం విచారకరమన్నారు. నాడు తాను భూములు ఇవ్వాలని చెప్తేనే ఈ ప్రాంత రైతులందరూ జిందాల్‌కు భూములు ఇచ్చారని, ఇప్పుడు అదే రైతులకు అన్యాయం జరిగితే నిర్వాసితుల తరపున పోరాడేందుకు దేనికైనా తెగిస్తానన్నారు. సిపిఎం నాయకులు చల్లా జగన్ మాట్లాడుతూ పోరాటాల్లో ఉన్న వారిని బైండోవర్ కేసులు పెట్టడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి వి.అప్పారావు, నిర్వాసితులకు మద్దతుగా పలు గ్రామాల సర్పంచులు, నిర్వాసితులు పాల్గొన్నారు

కలెక్టర్‌ను కలిసిన అశోక్ గజపతిరాజు

ప్రజాశక్తి-విజయనగరంకోట

గోవా గవర్నర్ గా పదవిని చేబట్టబోయే కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్ గజపతి రాజు గారు బుధవారం జిల్లా కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ను కలెక్టర్ ఛాంబర్ లో కలిశారు. జిల్లా అభివృద్ధి కార్యక్రమాలపై ఇద్దరూ చర్చించారు. కార్పొరేషన్ పరిధిలోని పారిశుధ్యం, అభివృద్ధి కార్యక్రమాలపై కూడా మాట్లాడుకున్నారు. గోవా గవర్నర్ గా నియమితు లైనందుకు కలెక్టర్ అంబేద్కర్ అశోక్ గజపతిరాజుకు అభినందనలు తెలిపారు.

కలెక్టర్‌తో మాట్లాడుతున్న అశోక్‌గజపతిరాజు

విద్యుత్ స్మార్ట్ మీటర్లు మాకొద్దు..

అయ్యప్ప నగర్‌లో అడ్డుకున్న పోరాట కమిటీ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అపార్ట్‌మెంట్లలో అదాని స్మార్ట్‌మీటర్లు బిగించేందుకు వచ్చిన సిబ్బందిని అయ్యప్పనగర్ పోరాటకమిటీ సభ్యులు అడ్డుకున్నారు. విజయనగరం పూల్‌బాగ్‌లోని అయ్యప్పనగర్ సాయి అమృత రెసిడెన్సీలో బుధవారం స్మార్ట్ మీటర్లు బిగించేందుకు విద్యుత్తుశాఖ సిబ్బంది వెళ్లారు. విషయం తెలుసుకున్న అయ్యప్పనగర్ పోరాట కమిటీ కన్వీనర్ యుఎస్ రవికుమార్ ఆ సిబ్బందిని ప్రశ్నించారు. అడ్డుకున్నారు. 2024లో రూ.600 వచ్చిన కరెంట్ బిల్లు నేడు రూ.2వేలు వస్తోందని, ఇప్పకే ఈ భారం మోయలేక పోతున్నామని. అదాని స్మార్ట్ మీటర్ బిగిస్తే వేలాది రూపాయలు బిల్లులు చెల్లించాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు ముందుగా రీఛార్జి చేసుకుంటేనే విద్యుత్తు వస్తుందని, డబ్బులు అయిపోగానే విద్యుత్ కట్ అయిపోతుందని, ఇలా ప్రజలను ఇబ్బందులు పెట్టడం కూటమి ప్రభుత్వానికి సరికాదని అన్నారు. మాకొద్దు ఈ స్మార్ట్ మీటర్ అంటూ తిప్పి పంపారు. ఇక్కడే కాదు నగరంలో ఎక్కడ బిగించినా అడ్డుకుంటామని హెచ్చరించారు.



బిగించేందుకు తెచ్చిన స్మార్ట్‌మీటరు

టిడ్కో గృహ నిర్మాణాలు వేగవంతం

టిడ్కో చైర్మన్ వేములపాటి అజయకుమార్

ప్రజాశక్తి-నెల్లిమర్ల

టిడ్కో గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని టిడ్కో చైర్మన్ వేములపాటి అజయకుమార్ కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. నెల్లిమర్ల సమీపంలోని సారిపల్లిలో నిర్మాణం లో ఉన్న 576 గృహాల పనుల పురోగతిని ఎమ్మెల్యే లోకం నాగ మాధవితో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా టిడ్కో హౌసింగ్ ప్రాజెక్టుల ప్రగతి, నిర్మాణ నాణ్యత, మౌలిక సదుపాయాల ఏర్పాటు, పంపిణీకి సంబంధించిన అంశాలపై సమగ్రంగా చర్చించారు. పనులు వేగవంతం చేయాలని కాంట్రాక్టర్లకు ఆదేశించారు. నెలల తరబడి అసంపూర్తిగా ఉన్న నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తిచేయాలని, దానికి కావలసిన బకాయిలు చెల్లించేందుకు ప్రభుత్వం సన్నద్ధంగావుందని కాంట్రాక్టులకు వివరించారు. ఎమ్మెల్యే లోకం నాగ మాధవి మాట్లాడుతూ నెల్లిమర్ల ప్రజలకు గృహ కలను సాకారం చేయడం తన ప్రధాన బాధ్యతని అన్నారు. నాణ్యతా ప్రమాణాలతో, పారదర్శకతతో నిర్మాణాలు పూర్తి చేసి త్వరితగతిన పంపిణీ జరగాలని చెప్పారు. కార్యక్రమంలో నెల్లిమర్ల నగర పంచాయతీ చైర్పర్సన్ సరోజిని, టిడ్కో ఎస్ఇ డి.నరసింహమూర్తి, ఇఇ డి వి రమణమూర్తి, డిఇ ఆర్ శశిధర్, ఎఇ ఎం.రాజీవ్ గాంధీ, కౌన్సిలర్ జనా సంధ్యారాణి, జనసేన నాయకుల జనా ప్రసాద్, ఎంఎం నాయుడు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



టిడ్కో గృహాలను పరిశీలిస్తున్న చైర్మన్, ఎమ్మెల్యే

ఇంజినీరింగ్ కార్మికుల నిరసన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మున్సిపల్ ఇంజినీరింగ్, నాన్ పిహెచ్ కార్మికులందరికీ బేసిక్ వేతనం రూ.21వేలు, టెక్నికల్ వేతనం రూ.24,500 చెల్లించాలని, థర్డ్ పార్టీ కార్మికులకు ఆప్కాస్ జీతాలు పదో తేదీ లోపు ఇవ్వాలని డిమాండ్‌చేస్తూ బుధవారం కంటోన్మెంట్ వాటర్ సప్లై ట్యాంక్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు చిన్న ,ఆదినారాయణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే మంచి జరుగుతుందని ఆశించామని, కానీ సమస్యలు పరిష్కరించడం లేదన్నారు. రాష్ట్ర వ్యాప్త సమ్మెకు మద్దతుగా నిరసన బ్యాడ్జీలు ధరించుకొని విధులకు హాజరవుతున్నామని, ప్రభుత్వం స్పందించకపోతే ఇక్కడకూడా సమ్మెకు వెళ్తామని తెలిపారు.

మార్గదర్శులను రిజిస్టర్ చేయాలి

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమతం
ఎరువుల సరఫరాపై నిఘా : కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరం కోట, కంటోన్మెంట్

పి 4 కింద పేదలను దత్తత తీసుకునేందుకు మార్గదర్శులను గుర్తించి వెంటనే రిజిస్టర్ చేయించాలని కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ తెలిపారు .సర్వే లో పేదలకు ఏ అవసరాలు ఉన్నాయో గుర్తించి వారికి తగ్గ మార్గదర్శులకు ట్యాగ్ చేయాలని సూచించారు. బుధవారం కలెక్టర్ వెబెక్స్ ద్వారా పి 4 , స్వర్ణాంధ్ర -స్వచ్ఛాంధ్ర , ఎరువుల సరఫరా, సీజనల్ వ్యాధులు తదితర అంశాల పై జిల్లా స్థాయి, మండల అధికారులతో సమావేశం నిర్వహించి పలు సూచనలను జారీ చేసారు. వచ్చే 3 వ శనివారం ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతమొందిద్దాం అనే నినాదం తో కార్యక్రమాలు చేయాలని తెలిపారు. జిల్లాలో వర్షాలు అధికంగా కురుస్తున్నందున సీజనల్ వ్యాధులు ప్రబల కుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. డిపిఒ, డిఎంహెచ్ఒ, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ, జిల్లా పరిషత్ సిఇఒలు వ్యక్తిగతంగా పర్యవేక్షించాలని తెలిపారు. జిల్లాలో ఎక్కడా ఎరువుల కొరత లేదని, అన్ని ఆర్‌ఎస్‌కెలలో సరిపడే ఎరువులను సిద్ధంగా ఉంచామని తెలిపారు. ఆర్‌డిఒలు ఎరువుల పై డైలీ నివేదికలను అందించాలని తెలిపారు. అన్నదాత సుఖీభవ పథకం కింద మండలాల వారీగా లబ్ధిదారులను వెరిఫై చేసి అర్హుల జాబితాలను సిద్ధం చేయాలని తహశీల్దార్లకు ఆదేశించారు.

మధ్యవర్తిత్వంపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-విజయనగరంలీగల్

మధ్యవర్తిత్వంపై అవగాహన కోసం బుధవారం జిల్లా కోర్టు నుంచి పూల్‌బాగ్ వరకు న్యాయమూర్తులు, న్యాయవాదులు, పారా లీగల్ వాలంటీర్లు, విద్యార్థులు అవగాహన ర్యాలీ చేపట్టారు.జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.బబిత జెండా ఊపి ఈ ర్యాలీని ప్రారంభిం చారు. న్యాయ వాదులకు, బ్యాంక్ అధికారులకు, ఇన్సూరెన్స్ అధికారు లకు మధ్యవర్తిత్వంపై అవగాహన అవసరమని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి మాట్లాడుతూ మధ్యవర్తిత్వాన్ని ప్రజలలోకి మరింత ముందుకు తీసుకెళ్లాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి ఎ.కృష్ణప్రసాద్, కలిశెట్టి రవిబాబు, న్యాయవాదులు పాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయవాదులు, విద్యార్థులు

‘గిరిజనులే తొలి స్వాతంత్ర్య సమరయోధులు’ పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఆంధ్ర వనవాసి కళ్యాణ్ ఆశ్రమ్ ఆధ్వర్యంలో సంకలనం చేసిన ‘గిరిజనులే తొలి స్వాతంత్ర్య సమరయోధులు’ అనే పుస్తకాన్ని కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయ ఇన్‌ఛార్జి వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ తంత్రవాహి శ్రీనివాసన్, ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ (జితేంద్ర మోహన్ మిశ్రాలు సంయుక్తంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాసన్ మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య సమరం లో గిరిజనుల సహకారం ఎంతైనా ఉందని, తమ ప్రాణాన్నే పణంగా పెట్టిన స్వతంత్ర సమర యోధుల త్యాగాన్ని మనం ఎప్పటికీ మరచిపోరాదని అన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న రాంజీ గోడు, భాగోజీ నాయక్, ఆంధ్ర ప్రదేశ్ నుంచి గం గంటం దొర, చంద్రయ్యదొర, లక్ష్మణ్ నాయక్ తదితరుల కృషి మారువలేనిదని కొనియాడారు. ఈ పుస్తకం గిరిజనుల చరిత్ర, ధైర్యం, త్యాగాలను ప్రతిబింబించడంతో పాటు, పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో విద్యార్థులకు ప్రేరణగా నిలుస్తుందని అన్నారు. అనంతరం రిజిస్ట్రార్ ప్రొ. జితేంద్ర మోహన్ మిశ్రా, ఆంధ్ర వనవాసి కల్యాణ ఆశ్రమ జిల్లా అధ్యక్షుడు గీతారెడ్డి, సెక్రటరీ దాసరి నారాయణ, నగర అధ్యక్షులు డాక్టర్ ఎన్.వి.ఎస్. సూర్యనారాయణ, యూని వర్సిటీ లైబ్రేరియన్ శంకర రెడ్డి కొల్లే పాల్గొన్నారు.

అశోక్‌ను కలిసిన స్పీకర్

ప్రజాశక్తి-విజయనగరంకోట

గోవా గవర్నర్ గా నియమితులైన మాన్సాస్ చైర్మన్, మాజీ కేంద్ర మంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజుకు రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు అభినందనలు తెలిపారు. బుధవారం అశోక్‌బంగ్లాకు వచ్చిన స్పీకర్ అశోక్‌ను మర్యాద పూర్వకంగా కలుసుకొని పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ అశోక్ గజపతి గొప్పదనాన్ని కొనియాడారు. నీతికి, నిజాయితీకి, నిరాడంబరతకు అశోక్ మారుపేరని పేర్కొన్నారు. గవర్నర్ పదవికి అశోక్ వన్నె తెస్తారని అన్నారు. ఆయనతో పాటు ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతిరాజు కూడా ఉన్నారు.

అశోక్‌కు చిత్రపటం అందజేస్తున్న అయ్యన్నపాత్రుడు

రాజుగారి కోరికతో రైతుబజారు ఖాళీ

ఆగమేఘాలపై ఆర్డర్ వేసిన కలెక్టర్
రేపటి నుంచి కూరగాయలు తెచ్చుకోవద్దన్న మార్కెటింగ్ శాఖ
రూ.కోట్ల విలువ చేసే స్థలం కోసమేనా?

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి / టౌన్

రాజు తలచుకుంటే కొరడా దెబ్బలకు కొదవ లేదంటారు. బుధవారం నగరంలో జరిగిన సన్నివేశం అందుకు అద్దం పట్టాయి. ఇటీవల గోవా రాష్ట్ర గవర్నర్‌గా నియమితులైన టిడిపి సీనియర్ నేత పూసపాటి అశోక్ గజపతిరాజు ఇలా కలెక్టర్‌ను కలిసేసరికి తహశీల్దార్ కార్యాలయం సమీపంలోని రైతుబజార్ స్థలం ఖాళీ చేసేందుకు ఆదేశాలు వెలువడ్డాయి. ఇలా కలెక్టర్ ఆదేశించారో లేదో...! క్షణాల్లో బుధవారం సాయంత్రం ఆఘమేఘాలపై రైతు బజార్ వద్దకు చేరుకున్న రెవెన్యూ, మార్కెటింగ్ శాఖ అధికారులు గురువారం నుంచి కూరగాయలు తెచ్చుకోవద్దని ఖరాఖండిగా చెప్పేశారు. దశాబ్దాలు తరబడి ఇక్కడి దుకాణాల ద్వారా జీవనం సాగిస్తున్న రైతులు, వ్యాపారులు నిర్ఘాంతపోయారు. ఏం జరిగిందో తెలుసుకునే లోపే దుకాణాల తొలగింపు ఆదేశాలతో రైతుల కంట కన్నీరు పెట్టుకున్నారు. ఇదంతా రూ.కోట్లు విలువచేసే స్థలం కోసమేనా? అన్న సందేహాలు వ్యక్తమౌతున్నాయి. ఇంతకీ ఏం జరిగిందంటారా...! అయితే ఇంకొంచెం లోతుల్లోకి వెళ్లాల్సిందే.

1968 సంవత్సరంలో అప్పటి ఇందిరాగాంధీ ప్రభుత్వం సంస్థానాలను రద్దు చేసి, వాటి పరిధిలోని ఆస్తులను కేంద్రం చేతుల్లోకి తీసుకుంది. అందులో భాగంగానే తహశీల్దార్ కార్యాలయం పక్కనే ఉన్న

ఖాళీ కానున్న రైతు బజారు ఇదే..

1.48ఎకరాల స్థలాన్ని కూడా కేంద్రం స్వాధీనం చేసుకుని, ప్రజాప్రయోజనం రీత్యా తొలుత జిల్లా కేంద్రాసుపత్రికి అప్పగించారు. తరువాత ఆసుపత్రి విస్తరణ అవసరాల రీత్యా పోలీస్ బ్యారెక్స్ పక్కకు మార్చారు. ఖాళీగావున్న ఈ స్థలంలో 1999లోనే అప్పటి టిడిపి ప్రభుత్వం రైతుబజారు ఏర్పాటు చేసింది. నాటి నుంచి 49 మంది రైతులు ఇక్కడ కూరగాయలు విక్రయించుకుంటూ జీవనోపాధి పొందు తున్నారు. నగరానికి నడిబొడ్డున ఉండటంతో ప్రజలు స్థానికంగా సరసమైన ధరలకు, తాజా కూరగాయలు, ఆకుకూరలు కొనుకునే అవకాశం కలిగింది. అయితే ఈ స్థలం తమదేనని రాజుగారు అన్నారో ఏమో మరి, ఖాళీ చేయించేందుకు ఆఘమేఘాలపై ఆర్డర్ వేశారట. బుధవారం కలెక్టర్ బిఆర్ అంబేద్కర్‌ను అశోక్‌గజపతిరాజు కలసిన తరువాత ఈ పరిణామాలన్నీ చోటు చేసుకున్నాయి. దీంతో రంగంలోకి దిగిన రెవెన్యూ, మార్కెటింగ్ శాఖ అధికారులు రైతుబజార్ స్థలాన్ని ఖాళీచేయించేందుకు కార్యాచరణ ప్రారంభించారు. ఈ స్థలం విలువ రూ.కోట్లలోనే ఉంటుంది. దీనికి బదులుగా ఇంకెక్కడైనా రైతుబజారు ఏర్పాటుచేస్తారా? అలా ఏర్పాటు చేసిన బజారు రైతులకు, ఇటు ప్రజలకు అనుకూలంగా, సౌకర్యవంతంగా ఉంటుందా? లేదా? అన్నది ఇంకా సందేహమే.

‘రాజు గారికి ఏం తక్కువ?’

రైతు బజారు ఖాళీచేయించేందుకు హఠాత్తుగా నిర్ణయం చేయడంతో రాజు గారికి ఏం తక్కువైంది... అంటూ నగరంలోని జనం పెదవి విరిస్తున్నారు. రాజ్యాలు పోయినా ప్రజాస్వామ్య వ్యవస్థలో కూడా అశోక్‌గజపతిరాజు రాజులానే ఉన్నారు. టిడిపి ఆవిర్భావం తరువాత ఆ పార్టీ తరపున ఈ జిల్లా రాజకీయాలు, పార్టీ అధికారంలో ఉన్నప్పుడు పరిపాలన పూర్తిగా ఆయన చేతుల్లోనే ఉంది. ఇప్పటికీ ఆ పార్టీలో ఎవరికి పదవి రావాలన్నా, ఉన్న పదవి ఊడి పోవాలన్నా ఆయన కనుసన్నల్లోనే జరుగుతుంది. మరోవైపు ల్యాండ్ సీలింగ్ నుంచి తప్పించిన మాన్సాస్ ట్రస్ట్‌కు ఆయనే ఛైర్మన్. వేల ఎకరాల భూములు, సింహాచలం దేవస్థానం సహా వందలాది ఆలయాలు, 11 విద్యాసంస్థలు ఆ ట్రస్ట్ పరిధిలోనే ఉన్నాయి. ఓ రకంగా చెప్పాలంటే అదో సామ్రాజ్యం. అంతకు మించి ఆయనకు వ్యక్తిగతంగా ఆస్తులు, అంతస్తులు, హోదా, గౌరవ తక్కువేం కాదు. నిన్నగాక మొన్న గోవా రాష్ట్ర గవర్నర్ గా నియమితులయ్యారు. ఈ జిల్లా నుంచి ఏడు సార్లు ఎమ్మెల్యేగా, పలు కీలక శాఖలకు రాష్ట్ర మంత్రిగా, కేంద్ర మంత్రిగా ఎదగడానికి జిల్లా వాసులు ఎంతగానో ఆదరించారు. అటువంటిది రాజుగారు ఈ మాత్రం స్థలానికి ఆశపడుతున్నారా అంటూ జనం చర్చించుకుంటున్నారు.

అవును ఖాళీ చేయిస్తున్నాం..

మహారాజా పాత ఆసుపత్రి స్థలంలో ఉన్న రైతుబజారును ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఖాళీ చేయిస్తున్నాం. ఇక్కడ 49 మంది రైతులు ఉన్నారు. తక్షణం వారికి ప్రత్యామ్నాయంగా ఆర్అండ్‌బి, దాసన్నపేట రైతుబజార్లలో కూరగాయల విక్రయానికి అవకాశం కల్పిస్తున్నాం. తరువాత ప్రత్యామ్నాయ స్థలం చూసి రైతుబజారును పునరుద్ధరిస్తాం.

బి.రవికిరణ్, మార్కెటింగ్‌శాఖ ఎడి



బొబ్బిలి మాజీ ఎమ్మెల్యేశంబంగిని సినీనటుడు ఆర్.నారాయణమూర్తి బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. - ప్రజాశక్తి, బొబ్బిలి

ఒకప్పటి డ్రాపౌట్.. నేడు ట్రిపుల్ ఐటికి ఎంపిక

ప్రజాశక్తి – బాడంగి

స్థానిక జెడ్‌పి ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివి 448 మార్కులు సాధించిన విశలాంగ విద్యార్థిని శ్రావణి విశలాంగ కోటాలో నూజివీడు ట్రిపుల్ ఐటికి ఎంపికైంది. ఈ సందర్భంగా ప్రత్యేక ఉపాధ్యాయుడు కొల్లి ఈశ్వరరావు మాట్లాడుతూ శ్రావణి ఆమె సోదరి ఇద్దరూ తెలివైన వారైనప్పటికీ డిజెబిలిటీ లోపం ఉన్నందున 5వ తరగతి వరకు పెదవడం గ్రామంలో చదివి తరువాత విశలాంగ దగ్గరలో ఉన్నత పాఠశాల లేనందున 4ఏళ్ళ పాటు పాఠశాలలో చేరలేకపోయారు. ఇద్దరూ డ్రాప్ అవుట్ అయ్యారని తరువాత వారి కుటుంబ సభ్యులు మీడియా ద్వారా విశలాంగులకు కూడా ప్రభుత్వ పాఠశాలలో ప్రత్యేక ఉపాధ్యాయులు ఉన్నారని తెలుసుకొని బాడంగి పాఠశాలలో వారి వయసుకు తగ్గట్టు ఆర్‌టిఇ చట్టం ద్వారా 8వ తరగతిలో డైరెక్ట్ అడ్మిషన్ తీసుకున్నారని చెప్పారు. దాని ఫలితంగా పదో తరగతిలో శ్రావణి 448, సోదరి విశాలాక్ష్మి 381 మార్కులు సాధించారన్నారు. ఇందులో శ్రావణి 448 మార్కులతో నూజివీడు ట్రిపుల్ ఐటీకి ఎంపికైందన్నారు. ఈ మేరకు బుధవారం శ్రావణిని, ప్రత్యేక ఉపాధ్యాయుడు కొల్లి ఈశ్వరరావుని హెచ్ఎం దత్తి సత్యన్నారాయణ ఇతర ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రయివేటు షాపులను ఆశ్రయించొద్దు

ప్రజాశక్తి – వేపాడ

ఎరువులు, విత్తనాలు కోసం రైతులు ప్రయివేటు షాపులను ఆశ్రయించొద్దని ఎఒ స్వాతి కుమారి తెలిపారు. బుధవారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ ఖరీఫ్ వరి నాట్లుకు అవసరమైన ఎరువులకు ఇండెంట్ పెట్టామన్నారు. రైతు సేవా కేంద్రంలో ప్రభుత్వం రైతులకు అవసరమైన ఎరువులు అందజేసుందుకు ఏర్పాట్లు చేస్తోందన్నారు. రైతులు తొందరపడి ప్రైవేట్ షాపుల వద్ద అధిక ధరలకు ఎరువులను కొనొద్దని తెలిపారు.

పోలింగ్ కేంద్రాల విభజనపై సమీక్ష

ప్రజాశక్తి – చీపురుపల్లి

ఎన్నికల పోలింగ్ స్టేషన్ల రేషనైలేజేషన్‌పై రాజకీయ పార్టీల అభిప్రాయ సేకరణకు సంబంధించి స్థానిక తహశీల్దారు కార్యాలయంలో బుధవారం జరిగిన సమీక్షా సమావేశంలో ఆర్‌డిఒ బి.ఆశయ్య పాల్గొని మాట్లాడారు. పంచాయతీలకు సంబందించి పోలింగ్ స్టేషన్ పరిధిలో 1200 ఓటర్లు ఉన్న పోలింగ్ కేంద్రాలను రెండు పోలింగ్ బూత్‌లుగా విభజించేందుకు అవకాశం ఉందన్నారు. మండలంలో ఎక్కడైనా సమస్యలుంటే తెలిపాలని రాజకీయ నాయకులను కోరారు. ఓటర్ లిస్ట్‌లో ఓటర్ల చేర్పులు, మార్పులు, తొలగింపులకు సంబందించి ఏ రాజకీయ పార్టీలకైనా అభ్యంతరాలుంటే తెలపాలన్నారు. ఈ సమావేశంలో తహశీల్దారు డి ధర్మరాజు, ఎన్నికల డిటి హర్షవర్ధిని, వైసిపి నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, మీసాల వరహాలనాయుడు, టిడిపి నాయకులు గవిడి నాగరాజు, రౌతు నారాయణరావు, జనసేన నాయకులు కోట్ల కృష్ణ, బిజెపి నుండి ఇప్పిలి నీలకంఠం తదితరులు పాల్గొన్నారు.

'మధ్యవర్తిత్వం -దేశం కోసం' పై అవగాహన

ప్రజాశక్తి– బొండపల్లి

మధ్యవర్తిత్వం దేశం కోసంపై బోడసింగిపేట కాలనీ వద్ద గజపతినగరం కోర్టు జడ్జి ఎ. విజయ్‌రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యవర్తిత్వం వల్ల కేసులను పరిష్కరించు కోవచ్చునని దీని ద్వారా డబ్బులు కూడా ఆదా అవుతాయని చెప్పారు. అనంతరం అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో పలువురు లాయర్లు తదితరులు పాల్గొన్నారు.

రేగిడి ఎఒగా శ్రీనివాసరావు

ప్రజాశక్తి– రేగిడి

మండల వ్యవసాయ అధికారిగా బి.శ్రీనివాసరావు బాధ్యతలు చేపట్టారు. ఈయన అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి మండల వ్యవసాయ అధికారిగా పనిచేస్తూ బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేసిన వ్యవసాయ అధికారి గిరడ మురళీకృష్ణ జద్చర్ల మండల వ్యవసాయ అధికారిగా బదిలీపై వెళ్లారు. ఖరీఫ్ వ్యవసాయానికి అధిక దిగుబడులు కోసం రైతులకు సూచనలు, సలహాలు అందించేందుకు కృషి చేస్తామన్నారు. అందరి సహకారంతో ప్రణాళికలతో ముందుకు వెళ్తామన్నారు.

ఘనంగా యూత్ స్కిల్ డే వేడుకలు

ప్రజాశక్తి – వేపాడ

మండలంలోని బక్కునాయుడుపేట ఎపి ఆదర్శ పాఠశాలలో మెగా యూత్ స్కిల్ డే ప్రిన్సిపల్ రావాడ ఈశ్వరరావు ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ యువతకు ఎంత నైపుణ్యం అవసరమో వివరించారు. సాంకేతిక శిక్షణ అవశ్యకత గూర్చి వివరించారు. వృత్తి విద్యా ఉపాధ్యాయులు, ఇంఛార్జి ప్రిన్సిపల్ విజయ మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుంచి వృత్తి విద్య కోర్సు ద్వారా విద్యార్థులు తమ నైపుణ్యాన్ని అభివృద్ధి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు క్విజ్, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. విద్యార్థులు సాంకేతికత విద్య గొప్పతనం లఘు నాటికను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు

ప్రజాశక్తి–విజయనగరం టౌన్

నగరంలో దోమల నియంత్రణకు ప్రజారోగ్య సిబ్బంది చర్యలు చేపట్టారు. దోమల వృద్ధి కేంద్రాలను నశింపజేయడానికి చెరువులు, కుంటలు, కాలువలలో నీరు నిలువ ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేకించి తయారు చేసిన ఆయిల్ బాల్స్ ను విడిచిపెట్టారు. ఆయిల్ బాల్స్ పిచికారి విధానంలో కొత్త పద్ధతిని ఈసారి ప్రయోగిస్తున్నట్లు కమిషనర్ నల్లనయ్య చెప్పారు. పరిసర ప్రాంతాలలో కొబ్బరి చిప్పలు, టైర్లు, కుండీలు, ఫ్రిడ్జ్ కింద వృథా నీరు వంటివి నిలువ లేకుండా చూసుకోవాలన్నారు.

చురుగ్గా పారిశుధ్య పనులు

ప్రజాశక్తి – వేపాడ

వల్లంపూడిలో పంచాయతీలో పారిశుధ్యం పనులు బుధవారం చురుగ్గా సాగాయి. ఈ పనులను పంచాయతీ కార్యదర్శి పద్మ పర్యవేక్షించారు. గ్రామంలో సిసి రోడ్లకు ఇరువైపులా ఏర్పాటు చేసిన కాలువల్లో పూడికను తొలగించి కాలవుల్లో బ్లీచింగు చల్లారు. చెత్తను డంపింగ్ షెడ్డుకు తరలించి తడి చెత్తను పొడి చెత్తను వేరు చేశారు. రోడ్డునకు ఇరువైపులా ఉన్న ముళ్ళ పొదలను, పిచ్చి మొక్కలను తొలగించి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా తగు చర్యలు తీసుకున్నారు. పంచాయతీ సర్పంచ్ రుద్ర అంజలి పాల్గొన్నారు.

పాఠశాలల సందర్శన

ప్రజాశక్తి – వేపాడ

మండల విద్యాశాఖాధికారి పి.బాలభాస్కరరావు బుధవారం కరకవలస, గుడివాడ ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు. పాటశాల పరిసరాలు, తరగతి గదులు, కిచెన్ గార్డెన్, సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్స్ పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో తెలుగు, ఇంగ్లీషు, చదివించడం, రాయించడం, చతుర్విద ప్రక్రియలు, పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

చోరీ నిందితుడికి ఏడు నెలల జైలు

ప్రజాశక్తి–విజయనగరంకోట

రైళ్లలో చోరీలకు పాల్పడుతున్న నిందితుడు కందాపు రవికుమార్‌కు విశాఖపట్నం రైల్వే కోర్టు మేజిస్ట్రేట్ అనురాగ్ ఏడు నెలల జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. గత ఏడాది మార్చిలో రైలులో చోరీ జరగ్గా జిఆర్‌పి ఎస్ఐ వి.బాలాజీరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పార్వతీపురం మన్యం జిల్లా వీరఘట్టాం మండలం, విక్రంపురం గ్రామానికి చెందిన రవికుమార్‌ను అరెస్ట్ చేశారు. నేరం రుజువు కావడంతో ఏడు నెలల జైలు శిక్ష విధించారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఇద్దరికి జరిమానా

బొబ్బిలి: మద్యం తాగి వాహనాలు నడిపిన ఇద్దరు డ్రైవర్లకు జరిమానా విధిస్తూ బుధవారం జూనియర్ సివిల్ జడ్జి జె.హేమస్రవంతి తీర్పు చెప్పినట్లు పట్టణ సిఐ కె.సతీష్ కుమార్ చెప్పారు. మద్యం తాగి ట్రాక్టర్ నడిపిన డ్రైవర్, ద్విచక్ర వాహనం నడిపిన డ్రైవర్ పై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచగా ఒకొక్కరికి రూ.10వేలు జరిమాన విధిస్తూ తీర్పు చెప్పినట్లు తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామన్నారు.

ఆ భూమి నాదే.. న్యాయం చేయండి

◆నాకు రావలసిన సొమ్మును వేరొకరి ఖాతాలో వేయించుకున్నారు ◆ పేదల ఇళ్ల కోసం భూములిచ్చాను ◆బాధితుడు నారాయణరాజు

ప్రజాశక్తి–చీపురుపల్లి

ఈ నెల జి.అగ్రహారం పరిధిలోని జగనన్న కాలనీకి వెళ్లే రోడ్డు వివాదానికి సంబంధించి వాస్తవ పరిస్థితులను బాధితుడు వివరించారు. అది రోడ్డు కాదని అది తనకు చెందిన జిరాయితీ భూమేనని చీపురుపల్లికి చెందిన సాగి నారాయణమూర్తి రాజు బుధవారం స్థానిక విలేకరులకు తెలిపారు. అప్పటిలో తనను నమ్మించి నట్టేట ముంచేశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వివరాలు ఆయన మాటల్లోనే.. నేను 2019లో జిల్లా కలెక్టర్ పిలుపు మేరకు చీపురుపల్లి పంచాయతీ పరిధిలో గల గులివిందాడ అగ్రహారం రెవెన్యూ పరిధిలో పేదల ఇళ్ల నిర్మాణం కోసం నాకున్న సుమారు 3.80 ఎకరాల వ్యవసాయ భూమిని ప్రభుత్వం నిర్ణయించిన ధరకు ఇచ్చాను. జి.అగ్రహారం రెవెన్యూ పరిధిలోని 107-1 సర్వే నెంబరులో 7 సెంట్లు భూమి, 104-14,15,16 సర్వే నెంబర్లలో 1.93 సెంట్లు భూమి, 106-13 సర్వే నెంబరులో 60 సెంట్లు భూమి, 101-1, 2, 3 సర్వే నెంబర్లలో 24 సెంట్లు భూమితో పాటు 102లో 14వ సర్వే నెంబర్‌లో కూడా 70 సెంట్లు భూమిని పేదల ఇళ్ల నిర్మాణం కోసం ఇచ్చాను. అయితే 102-14 సర్వే నెంబరు మినహా మిగతా సర్వే నెంబర్లలో భూమికి సుమారు రూ.1.25కోట్లు నా ఖాతాలో ప్రభుత్వం వేసింది. ఇంకా 102-14 సర్వే నెంబరుకు సంబంధించి నాకు రావలసిన సుమారు రూ.25 లక్షలు నాకు కాకుండా జి.అగ్రహారానికి చెందిన ఒక వ్యక్తి పేరు మీద 19 మార్చి 2020న అధికారులు డబ్బులు కక్కుర్తి పడి సుమారు రూ.19.80 లక్షలు అడ్డ దారిన వేరొక అకౌంట్‌లో వేశారు. అప్పటిలో నా భూమికి సంబంధించి నాకు రావలసిన డబ్బులను ఇచ్చేందుకు అప్పుడున్న తహశీల్దారుతో సహా రెవెన్యూలో పని చేస్తున్న కొంత మంది అధికారులు కూడా నా దగ్గర పెద్ద మొత్తంలో డబ్బులు గుంజుకున్నారు. నేను వృద్ధాప్యంలో ఉన్నాను. నా ఆరోగ్యం కూడా బాగోలేదు. అధికారుల చుట్టూ తిరగలేని పరిస్థితిలో ఉన్నాను. నాకు రావాల్సిన డబ్బులు నా ఖాతాలో వేయాలని కలెక్టర్‌ను కోరుతున్నట్లు బాధిత నారాయణమూర్తి రాజు వాపోయారు.

తన వద్ద ఉన్న ధ్రువపత్రాలను చూపిస్తున్న బాధితుడు నారాయణరాజు

రమేష్‌కు ఛైర్మన్ అభినందన

ప్రజాశక్తి – బొబ్బిలి

పట్టణంలోని అగురు వీధికి చెందిన బాడీ బిల్డింగ్ రమేష్ ఇటీవల ఢిల్లీలో జరిగిన బాడీ బిల్డింగ్ పోటీల్లో పాల్గొని జూనియర్ క్లాసిక్ ఫిజిక్ విభాగంలో 4వ స్థానం, జూనియర్ మెన్ ఫిజిక్ విభాగంలో 5వ స్థానం సాధించారు. ఈ మేరకు రమేష్‌ను పురపాలక సంఘ కార్యాలయంలో మున్సిపల్ ఛైర్పర్సన్ రాంబార్కి శరత్ అభినందించి సత్కరించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ ముందు ముందు ఇంకా మరెన్నో పోటీలలో పాల్గొని, మంచి మంచి విజయాలను సాధించాలని ఆకాంక్షించారు. బొబ్బిలి పేరును రాష్ట్ర, జాతీయ స్థాయిలో నిలబెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో 5వ వార్డు కౌన్సిలర్ వి.హైమావతి, 6వ వార్డు మాజీ కౌన్సిలర్ ఎస్.సాయి రమేష్, 13వ వార్డు కౌన్సిలర్ బి.శివ 16వ వార్డు ఇంచార్జ్ ఆర్. భాను, వెలగాడ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములకు రక్షణ కల్పించాలి

ప్రజాశక్తి – నెల్లిమర్ల

ప్రభుత్వ భూములకు రక్షణ కల్పించాలని జైభీమ్ భారత పార్టీ నాయకులు కనగిరి శ్రీనివాసరావు, చిన్నం అరుణ్ కుమార్, కుమార్ రాజు డిమాండ్ చేశారు. బుధవారం వారు నెల్లిమర్లలో విలేకర్లతో మాట్లాడుతూ గుషిణిలో సర్వే నెంబర్ 80, 79, 65/15లో ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురవుతున్నాయన్నారు. దీనిపై ఫిర్యాదు చేసినప్పటికీ రెవెన్యూ అధికారులు బోర్డులు ఏర్పాటు చేశారని తెలిపారు. అయితే ఆక్రమార్కులు ఆ బోర్డులు తొలగించి ప్రభుత్వ భూమిని ఆక్రమించుకున్నారని తెలిపారు. ప్రభుత్వ నిబంధనలు పాటించకపోవడంతో జెసికి ఫిర్యాదు చేశామని ఆయన తహశీల్దార్‌ని కలవమని చెప్పారని అన్నారు. తహశీల్దార్ వెంటనే స్పందించి బోర్డులు తొలగించిన వారిపై చర్యలు తీసుకొని ప్రభుత్వ భూములు రక్షించాలని కోరారు.

'సూపర్ సిక్స్ అమలు చేసి తీరుతాం'

ప్రజాశక్తి – వేపాడ

ఎన్నికల్లో ఇచ్చిన హామీలు మేరకు సూపర్ సిక్స్ అమలు చేసి తీరుతామని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. మండలంలోని వేపాడలో బుధవారం టిడిపి మండల అధ్యక్షులు గొంప వెంకటరావు ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పథకాలు గురించి ప్రజలకు వివరించారు. గ్రామంలో మహిళలు, వృద్ధులు, వికలాంగులతో మాట్లాడుతూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిరిజన కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి లక్ష్మి, నియోజకవర్గ మహిళా అధ్యక్షులు గుమ్మడి భారతి, మండల పార్టీ ఉపాధ్యక్షుడు పోతల వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి కె.రమణమూర్తి, శానాపతి గణేష్, దాలినాయుడు మాస్టర్, లక్ష్మణరావు, చొప్పదేముడు, వేచలపు జగ్గుబాబు, నిరుజోగ ఈశ్వరమ్మ, శానాపతి దేముళ్ళు, సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

రామభద్రపురం: సుపరిపాలన చంద్రబాబునాయుడుతోనే సాధ్యం అని స్థానిక ఎమ్మెల్యే బేబీ నాయన అన్నారు. జిల్లా బీసీ సెల్ ఉపాధ్యక్షులు కర్రోతు తిరుపతిరావుతో కలిసి బుధవారం ఎస్.సీతారాంపురంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న కార్యక్రమాలను వివరించారు. కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ప్రతిపక్షం విమర్శలు చేస్తుందని వీటిని ప్రజలంతా తిప్పి కొట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు మడక తిరుపతిరావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ప్రజలకి ఆమోదయోగ్యమైన పాలనను అందిస్తున్నాం

చీపురుపల్లి: ప్రజలకి ఆమోదయోగ్యమైన సుపరిపాలనను రాష్ట్రంలో అందిస్తున్నామని ఎమ్మెల్యే కిమిడి కళా వెంకట్రావు అన్నారు. సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని బుధవారం చీపురుపల్లి పంచాయతీ పరిధిలోని జి.అగ్రహారంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాబోయే కాలంలో కూడా ప్రజా సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో అమలు చేస్తామన్నారు. అంతకుముందు ఉపాధి హామీ నిధులు రూ.20.30 లక్షల వ్యయంతో నిర్మాణం చేసిన సిసి రోడ్డును మాజీ ఎమ్మెల్యే గద్దె బాబురావు, టిడిపి మండల అధ్యక్షుడు రౌతు కామునాయుడు, టౌన్ పార్టీ అధ్యక్షుడు గవిడి నాగరాజుతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

వేపాడ: ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే, టిడిపి నాయకులు

మభ్య పెట్టడంలో చంద్రబాబు దిట్ట : శంబంగి

ప్రజాశక్తి– రామభద్రపురం

ప్రతి ఎన్నికలోనూ ఆచరణకు సాధ్యం కాని హామీలను గుప్పించడం అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయకుండా ప్రజల్ని మభ్య పెట్టడంలో చంద్రబాబు దిట్ట అని నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమెల్యే శంబంగి వెంకట చినఅప్పల నాయుడు అన్నారు. స్థానిక వైసిపి కార్యాలయంలో బుధవారం జిల్లా ఉపాధ్యక్షుడు, ఎంపిపి చొక్కాపు లక్ష్మణరావుతో కలిసి వైసిపి మండల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శంబంగి మాట్లాడుతూ ఎన్నికల వేళ సూపర్ సిక్స్‌తో పాటు 143 హామీలు ఇచ్చిన చంద్రబాబు అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారన్నారు. ఈ వంచనను ప్రజలు జీర్ణించుకోలేకపోతు న్నారన్నారు. సూపర్ సిక్స్ హామీల్లో బాగంగా రైతులకు ఏడాదికి రూ.20 వేలు, ఆడబిడ్డకు నెలకు రూ.1500, 50 ఏళ్ల దాటిన వారికి పెన్షన్, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి, మహిళలకు ఉచిత బస్సు వంటి పథకాలు అమలు చేస్తానని చెప్పిన పెద్ద మనిషి ఇప్పటి వరకు అమలు చేయలేదని విమర్శించారు. ఈ సమావేశంలో ఎంపిపిలు బెల్లాన ప్రసాద్, పెంకి శేఖర్, మండల జెఇఎస్ కన్వీనర్ చింతల సింహాచలం నాయుడు, నాయకులు రాయులు, కిర్ల చంద్రశేఖర్, డర్రుపైడిరాజు, పత్తిగుళ్ల ఏకనాద్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి

శంబంగిని కలిసిన ఆర్.నారాయణమూర్తి

బొబ్బిలి: వైసిపి మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడుని సినీ నటుడు ఆర్.నారాయణమూర్తి వైసిపి కార్యాలయంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఇద్దరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. శంబంగిని కలవడం ఎంతో ఆనందంగా ఉందని నారాయణమూర్తి అన్నారు.

హామీలు అమలయ్యే వరకూ పోరాటం

ప్రజాశక్తి– డెంకాడ

గత ఎన్నికల్లో టిడిపి ఇచ్చిన హామీలను అమలు చేసేంత వరకూ వైసిపి ప్రజల పక్షాన పోరాడుతుందని మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పల నాయుడు అన్నారు. మండలంలోని డి. తాళ్లవలస, అమకాం, రఘుమండ, తిమ్మాపురం, గంట్లాం గ్రామాల్లో బుధ వారం బాబు షూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికీ ఏ గ్రామం వెళ్ళినా జగనన్న చేసిన అభివృద్ధే కనిపిస్తుందన్నారు. తనని గెలిపిస్తే 100 రోజుల్లో 100 కంపెనీలు తెస్తామని హామీ ఇచ్చిన ఎమ్మెల్యే నాగ మాధవి ఒక్క కంపెనీని కూడా తేలేదన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు పిన్నింటి తమ్మి నాయుడు, యువజన మండల అధ్యక్షుడు కరుమజ్జి త్రినాధరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు లంక లక్ష్మణరావు, అంగన్వాడీల వైసిపి జిల్లా అధ్యక్షులు పతివాడ కృష్ణవేణి, సర్పంచులు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలను ప్రదర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే, తదితరులు

37 కేజీల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి– డెంకాడ

అక్రమంగా కారులో తరలిస్తున్న 37 కేజీలు గంజాయిని పట్టుకొని ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు జిల్లా ఎస్‌పి వకుల్ జిందాల్ తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన గంజాయికి సంబంధించిన వివరాలను వెల్లడించారు. వాహన తనిఖీల్లో భాగంగా మండలంలోని జాతీయ రహదారి 5వ బెటాలియన్ మెయిన్ గేట్ ఎదురుగా పోలీసులు తనిఖీలు చేస్తుండగా కారులో అక్రమంగా గంజాయిన తరలిస్తున్నట్టు గుర్తించి వారి నుంచి 37 కేజీల గంజాయిను, 800 మారుతి కారును, ఒక సెల్ ఫోన్, ఒరిస్సాకు చెందిన భాస్కర్ గొల్లరి, అజయ్ గుంట అనే ఇద్దరు వ్యక్తులను పట్టుకున్నారు. మరో ఇద్దరు వ్యక్తులు రాజేష్, గణేష్ పరారయ్యాడని ఆయన కోసం గాలిస్తున్నామని తెలిపారు. నిందితుల గంజాయిని ఒరిస్సా రాష్ట్రంలో కారులో గంజాయి లోడ్ చేసుకుని విశాఖపట్నం తరలిస్తుండగా పోలీసులకు పట్టుబడ్డారని తెలిపారు. ఈ కేసులో క్రియాశీలకంగా పనిచేసిన భోగాపురం రూరల్ సీఐ జి.రామకృష్ణ, డెంకాడ ఎస్ఐ ఏ.సన్యాసినాయుడు, ఇతర పోలీస్ సిబ్బందిని ఆయన అభినందించారు. హెడ్ కానిస్టేబుల్ సివిరెడ్డి శంకర్రావు, కానిస్టేబుళ్లు రామరాజు, భరత్, జి మోహన్‌రావు, టి.శ్రీనివాసరావు, హోంగార్డు వైకుంఠరావులను అభినందించి ప్రశంసా పత్రాలను అందజేశారు.

నిందుతులు, స్వాధీనం చేసుకున్న గంజాయితో ఎస్‌పి, పోలీసులు

డెంకాడ పోలీసు స్టేషన్ సందర్శన

అంతకుముందు డెంకాడ పోలీసు స్టేషన్‌లో రికార్డులు, సిడి ఫైల్స్‌ను పరిశీలించి, గంజాయి కేసుల్లో నిందితులుగా ఉన్న వ్యక్తుల ఆర్థిక మూలాలను వెలికితీయాలని, గంజాయి వ్యాపారంతో సంపాదించిన ఆస్తులను జప్తు చేయాలని ఆదేశించారు. రహదారి ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, బ్లాక్ స్పాట్స్ వద్ద హెచ్చరిక బోర్డులను, స్టాపర్లు, లైటింగు ఏర్పాటు చేయాలన్నారు. హిట్ అండ్ రన్ కేసుల్లో క్రైం వాహనాలను త్వరితగతిన గుర్తించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. విజయనగరం డిఎస్‌పి ఎం.శ్రీనివా సరావు, సిఐ జి.రామకృష్ణ, ఎస్ఐ ఎ.సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

నానో ఎరువులనే వాడండి : ఎడి

ప్రజాశక్తి – బొబ్బిలిరూరల్

నానో ఎరువులు వాడి రసాయన ఎరువుల వాడకం తగ్గించి రసాయన ఎరువులపై పడుతున్న భారాన్ని తగ్గించుకోవాలని వ్యవసాయ శాఖ ఎడి యం.శ్యామ్ సుందర్ అన్నారు. బుధవారం పెంట గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సీజన్‌లో వరి, మొక్కజొన్న, చెరుకు పంటలలో కాలానుగుణంగా తీసుకోవలసిన జాగ్రత్తలు, ఎరువులు యజమాన్యం కలుపు యజమాన్యంపై రైతులుకు అవగాహన కల్పించారు. ఎకరానికి దమ్ములో ఒక బస్తా డిఎపి 30 కేజీల యూరియా వాడాలని, రసాయన ఎరువులు వాడకం కేవలం మట్టి నమూనా పరీక్ష ఫలితాలు ఆధారంగా మాత్రమే వాడాలని తెలిపారు. అవసరానికి మించి వాడితే దుష్ప్రభావాలు తప్ప ఉపయోగం ఉండదన్నారు. ప్రస్తుత రసాయన ఎరువులు స్థానంలో నానో యూరియా నానో డిఎపి వంటి ద్రవరూప రసాయన ఎరువులను తప్పనిసరిగా ఒకసారి పంట కాలంలో వాడుకుంటే మంచి ఫలితాలు ఉంటాయన్నారు. ఖర్చు కూడా తగ్గించుకోవచ్చని రైతులకు సూచించారు. పొలంలో రైతులు నాట్లు వేసినప్పుడు నారు కొనలు తుంచి వేసుకోవడం వల్ల ప్రధానంగా పురుగు నివారణకు సహకరిస్తుందని ఈ విధానం రైతులందరూ పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో పెంట గ్రామ వ్యవసాయ సహాయకురాలు శ్రావణి రైతులు పాల్గొన్నారు.

రైతులకు సూచనలు చేస్తున్న ఎడి శ్యామ్ సుందర్

గ్రామాల్లో పొలం పిలుస్తోంది

వేపాడ: మండలంలోని కుంపల్లి, కృష్ణరాయుడుపేట గ్రామాలలో బధువారం వ్యవసాయాధికారులు పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ స్వాతి నారుమడిలో తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులు వివరించారు. ఎద వరి సాగులో కలుపు యాజమాన్యానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలిపారు. వరి పంటలో ఎకరాకు 200 రూపాయలు చెల్లించినట్లయితే రూ.40వేలు వరకు ఇన్సూరెన్స్ కవర్ అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎడిఎ భానులత, సుస్థిర వ్యవసాయ కేంద్రం రీజనల్ కోఆర్డినేటర్ వెంకటరావు, ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మోటారు సైకిళ్ల చోరీ నిందితులు అరెస్టు

11 రాయల్ ఎన్‌ఫీల్డ్, రెండు యమహా మోటారు సైకిళ్లు స్వాధీనం

ప్రజాశక్తి–కంటోన్మెంట్

విజయనగరం 1వ పట్టణ, 2వ పట్టణ పోలీసు స్టేషను పరిధిలో రాయల్ ఎన్‌ఫీల్డు మోటారు సైకిళ్లను అపహరించిన పాత నేరస్తుడు విటి అగ్రహారం బిసికాలనీకి చెందిన ఉప్పడాల రాము, వాటిని విక్రయించడంలో సహకరించిన విశాఖ జిల్లా ఆమదాలవలస మండలం ముద్దాడపేటకు చెందిన ముద్దాడ నవీన్ అలియాస్ టైసన్ ను పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి 11రాయల్ ఎన్‌ఫీల్డ్ మోటారు సైకిళ్లు, 2 యమహా ఆర్ మోటారు సైకిళ్ళును రికవరీ చేసినట్లు ఎస్‌పి వకుల్‌జిందాల్ తెలిపారు. బుధవారం వన్‌టౌన్ పోలీసుస్టేషన్ ఆవరణలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఎస్‌పి ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. స్టేషను పరిధిలో రాయల్ ఎన్ఫీల్డ్ మోటారు సైకిళ్ళు చోరీకి గురవుతున్నాయని, వీటికి కారకులైన వారిని అరెస్టు చేసేందుకు నిఘా పెట్టామన్నారు. ఇందులో భాగంగా తోటపాలెం, వైఎస్ఆర్ నగర్‌కు చెందిన, ప్రస్తుతం విటి అగ్రహారం బిసి కాలనీలో నివాసం ఉంటున్న ఉప్పడాల రాము అలియాస్ డిజెను అరెస్టు చేసామన్నారు. గతంలో కూడా రాము బైకు చోరీలకు పాల్పడినట్లుగా పలు కేసులున్నాయన్నారు. నిందితుడు రాము ఇటీవల జైలు నుండి విడుదలైన తరువాత మళ్ళీ బైకు చోరీలకు పాల్పడ్డారన్నారు. చోరీ చేసిన మోటారు సైకిళ్ళను శ్రీకాకుళం జిల్లా ఆముదావలసకు తీసుకొని వెళ్ళి, అక్కడ ముద్దాడ నవీన్ సహకారంతో విక్రయించే వాడన్నారు. రాము నుండి 7 మోటారు సైకిళ్లను, ముద్దాడ నవీన్ నుంచి 6 మోటారు సైకిళ్లను రికవరీ చేసామన్నారు. రికవరీ చేసిన మోటారు సైకిళ్ళు విలువ రూ.26లక్షలు ఉంటుందన్నారు. కోర్టు ఆదేశాలతో బాధితులకు తిరిగి మోటారు సైకిళ్లను అందించేందుకు చర్యలు చేపడతామన్నారు. ఈ కేసులో క్రియాశీలకంగా వ్యవహ రించిన సిబ్బందిని ఎస్‌పి అభినందించి, ప్రశంసా పత్రాలు అందజేశారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

ప్రజాశక్తి– బాడంగి

మండలంలోని ముగడ దగ్గరలోని మైదానం వద్ద బుధవారం ఉదయం గుర్తుతెలియని మృతదేహం ఉందని ముగడ విఆర్ఒ పోలీసలకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఎస్ఐ తారకేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. సుమారు 54 సంవత్సరాలు గల వ్యక్తి మృతదేహం లభ్యమైందన్నారు. మృతుడు ఒంటిపై పచ్చ లుంగీ ఉందన్నారు. విజయనగరం నుండి క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్ పరిశీలించగా సుమారు ఏడు రోజులు క్రితమే చనిపోయాడని బాడీ పూర్తిగా పాడైపోయిందని తెలిపారు. మృతుడు కామన్నవలస, బాడంగి గ్రామంలో భిక్షాటన చేసుకుని ఉండేవాడిని కొంత మంది చెబుతున్నారు.

పాము కాటుతో మాజీ సర్పంచ్ మృతి

ప్రజాశక్తి– బొండపల్లి

గొట్లాం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, వైసిపి నియోజకగర్గ కార్యవర్గ సభ్యులు మీసాల తులసీరావు(56) పాము కాటుకు గురై మంగళవారం రాత్రి మృతి చెందారు. మంగళవారం ఉదయం ఇంటి వద్ద పెరట్లో గడ్డిని పరిశీలిస్తున్న సమయంలో పాము కాటకు గురై చికిత్స నిమిత్తం విజయనగరం సర్వజన ఆస్పత్రిలో చేరారు. అక్కడ ఇంజక్షన్ ఇచ్చిన తరువాత తిరిగి ఇంటికి వెళ్లిపోయారు. ఇంటి వద్ద ఒక్కసారిగా కుప్పకూలడంతో వెంటనే కుటుంబ సభ్యులు విజయనగరంలోని ఒక ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందారు. ప్రస్తుతం ఆయన భార్య మీసాల సరోజిని వైస్ ఎంపిపిగా ఉన్నారు. ఆయన మృత దేహనికి బుధవారం ఉదయం గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య, వైసిపి నాయకులు బి. ప్రభూజీ, జైహింద్‌కుమార్, ఎంపిపి చలంనాయుడు, బండారు బంగారం, బొద్దల చిన్నంనాయుడు, సర్పంచ్ ఎం. ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

తులసీరావు

మహారాజశ్రీ విజయనగరం ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు వారి దివ్యసముఖమునకు
OS 313/2021

Between :
ఓల్తేటి మహాలక్ష్మి .....వాది
And :
మజ్జి రమేష్ .....ప్రతివాది
To
మజ్జి రమేష్ S/o లేటు రామారావు, R/o డోర్ నెం. 44-49-51/2, సంజీవయ్య కోలనీ, కైలాసపురం, విశాఖపట్నం.

పై నెంబరు దావాలో ప్రతివాది తే 3-6-2018దీని, వాది వద్ద నుండి రూ. 6,00,000/- బదులు పుచ్చుకొని అదే రోజున ఒక ప్రాంశరీ నోటు వ్రాయించి ఇచ్చియున్నారు. సదరు ప్రోనోటు బాకీ తీర్చనందున OS 313/2021 దావా దాఖలు చేయగా సదరు దావా **తే 28-7-2025దీ**ని ప్రతివాది హాజరు నిమిత్తం వాయిదా వేసినారు. కావున పై కోర్టులో పై తేదిని **ఉదయం 10-30 గంటల నుండి సా॥ 5-00** మధ్య స్వయంగా గాని, వకీలు గారి ద్వారా గాని హాజరయి మీ యొక్క ఆక్షేపణలు తెలియపర్చుకోవలెను. లేని యడల సదరు దావా మీ పరోక్షమందు పరిహరించడమగునని యిందుమూలకముగా తెలియపర్చడమైనది.

డి.తవిటయ్య
న్యాయవాది,
విజయనగరం

మహారాజశ్రీ విజయనగరం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
EA 159/2025, EP 47/2022 in OS 141/2013

బిట్వీన్ :-
దబ్బాడ నీలకంఠం ........D.H.R
And :
రౌతు గోవింద & Others ....JDR's
JDR (1) రౌతు గోవింద, S/o సత్య నారాయణ @ సత్యం, వయస్సు 42 సం॥, ఆటో డ్రైవరు, R/of Door No-22-50-A, జి.అగ్రహారం గ్రామం, చీపురుపల్లి మండలం, విజయనగరం జిల్లా.
JDR (2) రౌతు గౌరి, W/o గోవింద, వయస్సు 35 సం॥, ఆటో డ్రైవరు, R/of Door No-22-50-A, జి.అగ్రహారం గ్రామం, చీపురుపల్లి మండలం, విజయనగరం జిల్లా.

ప్రకటన

పైన పేర్కొన్న DHR సదరు డిక్రీకి సంబంధించి సొమ్ము వసూలు నిమిత్తం Or 21 Rule 54 C.P.C ప్రకారం అమలులో దాఖలు చేసిన షెడ్యూలు స్థిరాస్తిని జప్తు కోరుతూ పై నెంబరు గల అమలు మీ పైన దాఖలు చేసియున్నారు. పై కోర్టువారి ఆర్డరు ప్రకారం ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది. కనుక సదరు పిటీషనుపై మీకు ఎటువంటి ఆక్షేపణలు ఉన్న యెడల మీరు స్వయంగా కాని, వకీలు ద్వారా కాని **తే 28-07-2025దీన ఉదయం గం॥ 10-30ని॥ల**కు పై కోర్టువారి యెదుట హాజరయి మీ ఆక్షేపణలు తెలియజేసుకోవలయును. లేనిచో మీ పరోక్షమున విచారించి తీర్మానించెదరని యిందుమూలముగా తెలియజేయడమైనది.

ఇట్లు
బెల్లాన రవి
DHR తరపు న్యాయవాది,
విజయనగరం